# పెద్దల సబ్బాతుబడి పాఠములు

# పరలోకము మరియు భూమి ఐక్యపర్చబడెను

# ఫిలిప్పీయులకు మరియు కొలొస్సయులకు

# వ్రాసిన పత్రికలలో యేసును గూర్చి నేర్చుకొనుడి

## మొదటి త్రిమాసం-2026



**జనవరి, ఫిబ్రవరి, మార్చి -2026**


గ్రంథకర్త

**క్లింటన్ వాహ్ లెన్**

అనువాదం

**చింతా ప్రకాష్**

12వ పాఠం మార్చి 14-20

# ఒకరితో ఒకరు జీవించుట

## సబ్బాతు మధ్యాహ్నము మార్చి14

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : కొలొస్స 3:18,19; సామె. 22:6,15; కొలొస్స 3:22-25; కొలొస్స 4:2-4.**

**కంఠతవచనం : "ప్రతి మనుష్యునికి ఏలాగు ప్రత్యుత్తరమియ్యవలెనో అది మీరు తెలిసికొనుటకై మీ సంభాషణ ఉప్పు వేసినట్లు ఎల్లప్పుడు రుచిగలదిగాను, కృపా సహితముగాను ఉండనియ్యుడి" (కొలస్సి 4:6).**

మనుష్యులు అందరు కలిసి పనిచేస్తూ సన్నిహిత బాంధవ్యాలు కలిగి జీవిస్తున్నప్పుడు, ఒకరితో ఒకరికి కొన్ని సమస్యలు కలుగవచ్చును. కొన్నిసార్లు వారి మధ్య వాగ్వాదములు తలెత్తవచ్చును. లేక ఒకరితో ఒకరు విబేధించవచ్చును. అందుచేత బాంధవ్యములు పటిష్టముగా ఉండునట్లు ప్రతి ఒక్కరు కలిసి జీవించుటకు ప్రయత్నము చేయుట చాలా అవసరము.

అయితే మనకు బహు దగ్గర బంధువులతో ఒక కుటుంబము వలె సన్నిహిత బాంధవ్యములు కొనసాగునట్లు ఒక కుటుంబ సభ్యులుగా మెలగుట చాలా ప్రాముఖ్యము. కుటుంబము చేసే వ్యాపారమును కొన్నిసార్లు వారి కుటుంబమునకున్న పేరు మీద చేస్తూ ఉంటారు. ఎందువలనంటే ఒక కుటుంబముగా జీవించుటెట్లో వ్యాపారము చేయుటకు కూడా అదేవిధానము అనుసరించి యుంటుంది గనుక ఆ కుటుంబము పేరు మీద వ్యాపారము నడిపిస్తూ ఉంటారు. కుటుంబ సభ్యులందరూ కలిసి ఆ వ్యాపారమును నిర్వహిస్తారు. వారి ప్రణాళికను గూర్చి వారి నమ్మకాలను గూర్చి ఆ వ్యాపారమునకు సంబంధించి కుటుంబ సభ్యులందరు ఏకీభవించి పని చేయాలి. ముఖ్యముగా ఒకరితో ఒకరు బేదాభిప్రాయాలేకుండా కలిసి పనిచేయాలి. అది వారి గృహము విషయమేగాని లేక వ్యాపార సంబంధమైన విషయమే గాని, ప్రతి ఒక్కరు వారివారి విధులను సక్రమముగా నిర్వహించాలి. అప్పుడు ఆ గృహమే గాని వ్యాపారమేగాని సంతోషముగా మనుగడ సాగించవచ్చును. అయితే క్రైస్తవ సంఘము విషయములో ఏమిటి? క్రైస్తవ సంఘము అంటే అదొక పెద్ద కుటుంబమని అర్థము. అందువలన గృహము విషయములోను, గృహమునకు చెందిన వ్యాపార విషయములోను ఏ నియమములు పాటించవలసి యున్నదో క్రైస్తవ సంఘ నిర్వహణలో కూడా అవే నియమములు పాటించవలసి యున్నది లేక అవే నియమములు వర్తిస్తాయి.

ఈ వారము యొక్క కంఠత వచనములో ఒక క్రైస్తవ కుటుంబము సామరస్యముగా ఎట్లు జీవించాలో పౌలు కొన్ని ప్రాముఖ్యమైన నియమములను సూచించుచున్నాడు. క్రైస్తవ గృహము బైబిలు నియమములను పాటించవలెను. అయితే పౌలు కాలములో గృహమునకును మరియు రోమా గృహమునకును అనేకమైన తేడాలు ఉన్నవి. అదే సమయములో మన మధ్యన బాంధవ్యములు సామరస్యముగా కొనసాగుటకు కూడా పౌలు కొన్ని నియమములను సూచించెను.

మార్చి 21, సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును చదువుటకు సిద్దపడుడి.

**ఆదివారం** **మార్చి 15**

## భర్తలు మరియు భార్యలు (కొలొస్స 3:18,19)

క్రైస్తవ గృహములకు మంచి సలహాలను నూతన నిబంధన గ్రంథము అందించుచున్నది. (ఎఫెసి 5:21–6:9; కొలొస్స 3:18–4:1; తీతు 2:1–10; మరియు 1పేతురు 2:18–3:7) ఈ సలహాలకు "గృహ నియమములు" అని పేరు పెట్టబడెను. ఒక కుటుంబములో కేవలం ఎవరు యజమానిగా లేక పెద్దగా వ్యవహరించాలి అనే విషయమును ఇక్కడ సూచించుట లేదు గాని కుటుంబములలో ఉండే బాంధవ్యముల ద్వారా సంతోషముగాను మరియు ఆరోగ్యవంతులుగాను కలిసి మెలిసి జీవించాలనే నియమములను గూర్చి కూడా ఇందులో పొందుపరచబడెను.

**కొలొస్స 3:18,19 చదువుడి. ఈవాక్యములలో పౌలు ఇచ్చుచున్న సలహా ఏమిటి? ఎఫెసి 5:22–25, 33లో పౌలు ఇంకా ఏ ఇతర సలహాలను సూచించెను?**

బైబిలు నుండి పేర్కొనబడిన ఈ క్రింది వాక్యమును ఎక్కువ మంది భర్తలు మెచ్చుకుంటారు. "భార్యలారా, మీ భర్తలకు విధేయులై యుండుడి. ఇది ప్రభువును బట్టి యుక్తమైయున్నది" (కొలొస్స 3:18) అయితే ఎక్కువ మంది పురుషులు ఆ వాక్యములోని చివరి భాగమును అనగా "ప్రభువును ఘనపరచే విధానాలలో పరిస్థితులు ఉన్నపుడు" అనే భావమును విడిచి పెట్టి వేస్తారు. పురుషులందరికి స్త్రీలు విధేయత చూపించాలి అని నూతన నిబంధన ఎక్కడ బోధించుట లేదు. భర్తలకు ఏమి అవసరమో లేక ఏమి చేయమని అడుగుదురో వాటిని స్త్రీలు బానిసలవలె చేయుటయే వారి పని అని నూతన నిబంధన బోధించుటలేదు. ఈ సందర్భముగా భార్య మొదటగా యేసుకు తరువాత భర్తకు విధేయురాలైయుండాలని పౌలు చెప్పుచున్నాడు. భార్య యొక్క వ్యక్తిత్వమును ఆమె భర్త అదుపు చేయకూడదు. భర్త ఇంకా తన భార్యకు ఏది న్యాయమో లేక ఏది తప్పో నిర్ణయించకూడదు. అటువంటి విషయాలలో బైబిలు మరియు పరిశుద్ధాత్మ ఆమె తనంతట తానుగా నిర్ణయించుకొనుటకు సహాయపడును.

యేసు క్రైస్తవ సంఘమును ప్రేమించి, ఆమెను రక్షించుటకు తన ప్రాణమును అర్పించెను. భర్తలు వారి భార్యలను ఏవిధంగా ప్రేమించాలో యేసు యొక్క ప్రేమ చూపిస్తుంది

(ఎఫెసి 5:25) భర్తలు వారి భార్యలను మోసము చేయకూడదు. వారి పెళ్ళినాటి ప్రమాణాలను గౌరవించాలి. భర్తలు వారి భార్యలకు దీవెనకరముగా ఉండే తీర్మానాలు తీసుకొనవలెను. ఈ విధముగా భర్త అతని భార్యను ప్రేమించినపుడు అతనిని గౌరవించాలనే ఆజ్ఞకు ఆమె విధేయురాలగుటకు సహాయపడుతున్నాడని అర్థము (ఎఫెసి 5:33).

సౌఖ్యముగా నున్న క్రైస్తవ వివాహములో భర్త మరియు భార్య జంటగా కలిసి పనిచేస్తారు. ఈ జంట కలిసి తీర్మానాలు తీసుకుంటారు. ప్రణాళికలు వేసుకుంటారు. కొన్ని సందర్భాలలో భార్య భర్తలు చర్చలలోను, ప్రణాళికలలోను వారి పిల్లలను కూడా భాగస్తులుగా చేర్చుట లేక ఆహ్వానించుట ఎంతైనా అవసరముంటుంది. అయితే ఎటువంటి పరిస్థితులలోను వారి పిల్లల యెదుట తల్లిదండ్రులు వాదించుకొనుట లేక పోట్లాడుకొనుట చేయకూడదు. భార్యభర్తల మధ్య భార్యగాని లేక భర్త గాని ఏదైనా ఒక విషయములో అతని లేక ఆమె అంగీకారమును తెల్పనిచో ఏమి చేయాలి? అట్టి సందర్భములో మనమేమి చేయాలో బైబిలు బోధిస్తుంది. బైబిలు సత్యమునకు భర్త లేక భార్య ప్రణాళికలు వ్యతిరేకము కానప్పుడు, దంపతులిరువురు తీర్మానమును అంగీకరించాలి. ఈ సలహాను పాటించినయెడల అది కుటుంబములో సమాధానమును తెచ్చును. అదే సమయములో వారి భార్యలు ఎంతో తెలివి తేటలతో ఇంతకు పూర్వము ఇచ్చిన సలహాలను ఎక్కువ మంది భర్తలు జ్ఞాపకముంచుకోవాలి. దంపతులు కలిసి కట్టుగా పనిచేసినప్పుడు వారి వివాహము సుఖసంతోషాలతో ఉండును.

**సోమవారం** **మార్చి 16**

## తల్లిదండ్రులు మరియు బిడ్డలు (సామెతలు 22:6,15)

బిడ్డలు ఒక కుటుంబములో చాలా ప్రాముఖ్యమైనవారు. తల్లిదండ్రులు వారిని ప్రేమిస్తున్నారని పిల్లలు గ్రహించవలసియున్నది. దేవుడు వారిని ప్రేమించుచున్నాడని తల్లిదండ్రులు వారికి బోధించవలెను. దేవుని రాజ్యములో పిల్లలు సభ్యులై యుండాలని దేవుడు కోరుచున్నాడు. కుటుంబ ప్రార్థన చాలా ప్రాముఖ్యమైనది. ప్రతి దినము ఉదయమున సాయంత్రములు కుటుంబ ప్రార్థన కూడిక ఉండాలి. అది చాలా ప్రాధాన్యతతో కూడినది. చిన్న ప్రాయములోనే గృహమును పరిశుభ్రము చేయాలని మరియు గృహమునకు సంబంధించిన ఇతర పనులలో పాల్గొనాలని పిల్లలకు నేర్పించాలి. ప్రాముఖ్యముగా పిల్లలు పౌలు సూచించిన ఆజ్ఞకు విధేయత చూపించాలి. “పిల్లలారా, అన్ని విషయములలో మీ తల్లిదండ్రుల మాట వినుడి. ఇది ప్రభువును బట్టి మెచ్చుకొనతగినది” (కొలొస్స 3:20).

ఈ క్రింది వాక్యములను చదువుడి. మన పిల్లలను పెంచి పోషించుటలోను లేక వారిని తర్బీదునిచ్చుటలోను బైబిలులోని ఈ వాక్యములు మనకు ఏ ముఖ్యమైన విషయాలను బోధించుచున్నవి.

1. సామెతలు 22:6,15 ..........................................................

2. మత్తయి 19:14 ..............................................................................

3. ద్వితియోప 6:6,7 ..........................................................................

4. సామెతలు 1:8,9 ............................................................................

ఏవిధముగా జీవించాలో తల్లిదండ్రులు వారి పిల్లలకు నేర్పించాలి లేక చూపించాలి. వారు తప్పనిసరిగా బైబిలు సత్యమును వారి పిల్లలకు బోధించాలి. యేసును వెంబడించాలని వారి పిల్లలకు తల్లిదండ్రులు తర్ఫీదు చేసినప్పుడు, ఆ పిల్లలు కుటుంబమునకు, సంఘమునకు సమాజమునకు దీవెనకరముగా ఉంటారు. కోపముతో వారి పిల్లలకు బోధించకుడి మరియు శిక్షించకుడి అని తల్లిదండ్రులకు పౌలు హెచ్చరించుచున్నాడు. "తండ్రులారా, మీ పిల్లల మనస్సు క్రుంగకుండునట్లు వారికి కోపము పుట్టింపకుడి" (కొలొస్స 3:21) అందుచేత తల్లిదండ్రులు వారి పిల్లలకు నేర్పించేటప్పుడు, శిక్షించేటపుడు ప్రేమతో చేయవలెను. ఈ విషయములో తల్లికన్నా తండ్రికి ఎక్కువ బాధ్యత ఉన్నది. పిల్లల యొక్క ఆధ్యాత్మిక జీవితములలో విజయవంతులుగా ఉండాలంటే తండ్రి ప్రాముఖ్యమైన పాత్రను పోషించవలెను.

**కొన్ని అధ్యయనముల ప్రకారము కనుగొన్నదేమిటంటే తల్లిదండ్రులిరువురు క్రైస్తవ దేవాలయమునకు వెళ్ళిన యెడల, వారి పిల్లలు కూడా ఆలయమునకు క్రమముగా వెళ్ళటము నేర్చుకుంటారు. వారు పెద్దవారైనపుడు ఆ అలవాటును కొనసాగిస్తారు. ప్రతివారము తండ్రి గనుక దేవాలయమునకు వెళ్ళినట్లయితే, పెద్ద వారి వలె పిల్లలు కూడా దేవాలయములో కూర్చుంటారు. అందుచేత తండ్రి వారి కుటుంబమునకు ఆత్మీయ నాయకుడుగా, బలమైన మాదిరిగా తన పాత్రను పోషించినపుడు అది వారి పిల్లలకు సహాయపడుతుంది.**

**మంగళవారం** **మార్చి 17**

## కలిసి పనిచేయుట (కొలొస్స 3:22-25)

**కొలొస్స 3:22-25 మరియు కొలొస్స 4:1లో బానిసలకు పౌలు ఇచ్చిన సలహా ఏమిటి? ప్రజలతో కలిసి పనిచేసే విధానమునకు సంబంధించి ఏ ముఖ్య నియమాలను ఈ వాక్యాలు బోధించుచున్నవి?**

నేడు కొంతమంది ప్రజలు "బానిసత్వము" అనే అంశమును ఎత్తిచూపుతూ దానిని ఒక సాకుగా చూపించి, బైబిలులోని కొన్ని భాగములను కొట్టి పారేస్తున్నారు. అయితే బైబిలులో ఈ బానిసత్వము అంశమును గూర్చి అధ్యయనము చేసినట్లయితే మనము ముందుగా పాతనిబంధన, క్రొత్త నిబంధనలతో కూడి బైబిలు చరిత్రను తెలుసుకోవాలి. దేవుడు మనుష్యులకు తనకు నకలుగా ఉన్నట్లు తన స్వరూపమందు సృజించెను అని బైబిలు మనకు బోధించుచున్నది. మనకు స్వేచ్ఛా జీవితమును జీవించే విధముగా సృజింపబడితిమి. అందుచేతనే మోషే ఈలాగు ఆజ్ఞాపించెను. ఇశ్రాయేలీయులు శాశ్వతకాలము బానిసలుగా ఉండనేరరని చెప్పెను. (ద్వితియో 15:12) ఎవరైనా ఒక మనిషి 6 సం॥లకు మించి బానిసగా ఉండకూడదు. ఎవరైతే బానిసగా

వేరొకరికి పనిచేయుచున్నాడో, ఆ బానిస తాను చెల్లించవలసిన బాకీని తీర్చివేయుటకు 6 సం॥లు ఆ వేరొక వ్యక్తి క్రింద పనిచేస్తే సరిపోతుంది (నిర్గమ 21:2-6; లేవీ 25:39-43) మన నవీన కాలములో బానిసగా పనిచేసే విధానము నూతన నిబంధన కాలములో బానిసలుగా పనిచేసిన విధానమునకు సమానము కాదు. నూతన నిబందన కాలములో బానిసలుగా పనిచేసే విధానము వేరుగా ఉన్నది. కొన్ని వందల సం॥ల నుండి బానిసలుగా పనిచేయించుకొనుట గొప్ప నేరముగా పరిగణింపబడినది.

నూతన నిబంధన కాలములో సంఘము రోమా రాజ్య చట్టములను అనుసరించవలసి వచ్చెను. రోమీయులు బానిసలను వారి ఆస్తిగా కలిగియుండుట రోమా ప్రభుత్వ చట్టములు అనుమతించెను. అయితే అదే సమయములో ఆ రోమా చట్టము బానిసలకు కూడా కొన్ని హక్కులను లేక అనుమతులను మంజూరు చేసెను. బానిసలకు ఇవ్వబడిన హక్కుల ప్రకారము వారు కూడా రోమా ప్రజలు చేసుకొనే కొన్ని పనుల వంటివి బానిసలు కూడా చేసుకొనుటకు అనుమతులు ఇవ్వబడెను. ఒకవేళ క్రైస్తవులు బానిసత్వమును రూపుమాపుటకు ప్రయత్నించినయెడల నూతననిబందన కాలములో వారు దేవునికి చేయవలసిన పని కుంటుపడిపోయే పరిస్థితి ఏర్పడినది. అందువల్ల క్రైస్తవులు ఆ కాలములో ప్రయత్నించలేదు.

ఒక క్రైస్తవ సంఘ సభ్యుడుగా, ఒక బానిస ముందుగా దేవునికి తన విధేయతను చూపించాలి. బానిసల యొక్క యజమానులకు పౌలు ఏవిధముగా చెప్పెను (కొలొస్స 4:1) సంఘ సభ్యుడైన ఫిలోమోనుకు ఒనేసీము విషయములో 'యజమానులారా, పరలోకములో మీకును యజమానుడున్నాడని యెరిగి న్యాయమైనదియు ధర్మానుసారమైనదియు మీ దాసుల యెడల చేయుడి" (కొలొస్స 4:1) ఒనేసీము ఇక మీదట బానిసగా కాకుండా తన సహోదరునిగా భావించి అతనిని ప్రేమించవలెనని చెప్పెను" (ఫిలోమోను 1:16) పాతనిబంధన మరియు క్రొత్త నిబంధనలో దేవుని ప్రజలను దేవునికి బానిసలు లేక సేవకులని పేరుతో పిలిచేవారని మీకు తెలుసా? (కీర్తన 34:22; లూకా 17:10; 1పేతురు 2:16) మన హృదయములను గర్వములేకుండా ఖాళీగా ఉంచుటకు గుర్తుండే విధముగా అది మనకు సహాయము చేయును.

బైబిలు కాలములలో సంభవించిన విషయాలు మనకు సంభవిస్తే మనము ఇష్టపడకపోవచ్చు. ఇట్టి విషయములో బానిసత్వము ఒకటి. బైబిలేమి చెపుతుందో దానిని అంగీకరించాలి. సత్యమొక్కటే. సొంత అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తే బైబిలేమి చెపుతుందో అనేది తెలుసుకోవాలి. ఆ అంశము గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో స్పష్టముగా గ్రహించగలుగుదుము.

**బుధవారం** **మార్చి 18**

## ఒకరికొరకు ఒకరు ప్రార్థించుడి (కొలొస్స 4:2-4)

**కొలొస్స 4:2-4 చదువుడి. ప్రార్ధనకు సంబంధించిన ముఖ్యమైన నియమాలను గూర్చి ఈ వాక్యాలు మనకు ఏమి బోధించుచున్నవి? దేనికొరకు ప్రార్థించమని ప్రజలను పౌలు కోరుచున్నాడు?**

సహాయము అవసరమైన వారెవరికైనా సర్వ సాధారణముగా మనము చెప్పే మాటలు ఏమిటంటే "నేను మీ కొరకు ప్రార్థించుచున్నాను" పరలోకముతో మనలను జత చేసి మాట్లాడే విధానమునే ప్రార్ధన అని పిలుస్తారు. "దేవునిని మనము ఏమి అడుగుచున్నామో వాటిని మనకు అనుగ్రహించడమే దేవుని యొక్క ప్రణాళికలో భాగమైయున్నది. విశ్వాసముతో దేవునిని మనము అడిగిన వాటిని ఆయన మనకు అనుగ్రహిస్తాడు. ఆయనను అడుగుచున్నాము కాబట్టి ఆయన మనకు ఇచ్చుచున్నాడు. మనము దేవునిని అడగని యెడల వాటిని పొందుకొనలేము" –ఎలెన్ జి వైట్, మహా సంఘర్షణ, పుట 525.

ప్రార్ధన గూర్చి మాట్లాడేటప్పుడు పౌలు ఉపయోగించిన మాటలను గమనించాలి "ఎడతెగకుండ" "మెలకువగా ఉండి" "జాగ్రత్తగా పరిశీలించి" మరియు "దేవునికి వందనములు తెలియపర్చుటకు జ్ఞాపకముంచుకొనుడి" (కొలొస్స 4:2) పౌలు యొక్క ప్రార్ధన విశ్వాసముతో కూడుకున్నదని ఈ మాట మనకు తెలియజేయుచున్నది (కొలొస్స 4:2) వేరొకచోట పౌలు మనలను ఎల్లప్పుడు ప్రార్థించుడి అని చెప్పెను (ఎఫెసి 6:18) మరియు ప్రార్థించుట ఎన్నడు మానవద్దు (1థెస్సలో 5:17). ప్రార్థించుట మనకు తెలియకపోయినను, దేవుని యొక్క ఆత్మ తానే స్వయముగా మన కొరకు ప్రార్థించును. ఒకవిధముగా ఏ మనుష్యుడు పలుకలేని మాటతో పరిశుద్ధాత్మ మన పక్షమున దేవునికి మొఱ్ఱ పెట్టును (రోమా 8:26).

**మరొకసారి కొలొస్స 4:3 చదువుడి. ఈ వాక్యములో పౌలు ఈవిధంగా చెప్పాడు. "ప్రార్ధనయందు నిలుకడగా ఉండి కృతజ్ఞత గలవారై దానియందు మెలకువగా ఉండుడి" నీ విశ్వాసమును ఇతరులతో పంచుకొనుటకు నీకు దేవుడు ఏ ద్వారమును తెరువనైయున్నాడు?**

న్యాయమైన మాటలను పలుకునట్లు సహాయము చేయమని పౌలు ప్రార్థించెను. కొన్నిసార్లు పౌలు వ్రాసిన పత్రికలను చదివినప్పుడు ఆయన ఏమి చెప్పాలనుకున్నాడో ఆ విషయాలను గూర్చి శుభవార్తను అందరికి అర్ధమయ్యే విధముగా చేయమని మరియు బోధించుటకు ఆయనకు సహాయము చేయమని ప్రార్థించెను (కొలొస్స 4:4) రాజు యొక్క గృహసభ్యులకు, రోమా ప్రభుత్వములో ఉన్న శక్తివంతమైన నాయకులకు శుభవర్తమానమును బోధించవలసిన అవసరమున్నదని పౌలు గ్రహించెను. అది చాలా కష్టముతో కూడుకున్న ప్రయత్నము కాబట్టి పౌలు ముందుగా దేవుని సహాయమును అతనికి అనుగ్రహించమని ప్రార్థించెను.

**ప్రార్థించే ప్రతిసారి మనము మోకరించవలసిన నియమమేదియు లేదు. నీవు ఒంటరిగా ఉన్నపుడు, నీవు నడుచుచున్నపుడు నీ అనుదిన చర్యలలో పాల్గొనుచున్నపుడు, నీవు పనిచేయుచున్నపుడు రక్షకునితో మాట్లాడే అలవాటును ప్రారంభించు. సహాయము**

**కొరకు నిశబ్దముగా హృదయములోనే ప్రార్ధన చేసుకో. బలము, శక్తి మరియు జ్ఞానము కొరకు ప్రార్థించు. నీవు పీల్చుకొనే ప్రతి శ్వాస ఒక ప్రార్ధనగా మార్చుకో- ఎలెన్ జి వైట్, స్వస్థతా పరిచర్య పుట 510, 511.**

గురువారం మార్చి 19

## నీవు జీవించే విధానములో జాగ్రత్తగా ఉండు (కొలొస్స 4:5,6)

క్రైస్తవులముగా మనము తెలుసుకొనవలసిన ప్రాముఖ్యమైన బైబిలు సత్యము ఏమిటి? మన పాపములనిమిత్తమై యేసు మరణించెను అనే విషయము ప్రాముఖ్యమైనదే. పాపమునకు వ్యతిరేకముగా మనము పోరాడుటకు అవసరమైన శక్తిని ఆయన మనకు అనుగ్రహించును. మనము యేసును నమ్మిన యెడల నిత్యజీవమును పొందుదుము. ఈ బైబిలు సత్యమును మనంతట మనము నేర్చుకొనలేము. దానిని గురించి దేవుడు మనకు చెప్పవలసిన అవసరమున్నది. దేవుడు తన వాక్యమైన బైబిలులోను, తన కుమారుడైన యేసునిలోను ఈ సత్యమును మనకు చూపించెను.

దేవుని వాక్యము అనబడే బైబిలులో సత్యమును గూర్చి, జ్ఞానమును గూర్చి వివేకమును గూర్చి దేవుడు మనకు చూపించెను. గనుక మనము ఎన్నో విషయాలను తెలుసుకొనగలుగుచున్నాము మనము తెలివి తేటలతోను వివేకముతోను నింపబడియున్నామని మన జీవితములు చూపించాలని దేవుని కోరికైయున్నది.

**కొలొస్స 4:5,6 చదివి ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు కనుగొనండి. ఎటువంటి సమయములలో మనము జ్ఞానులముగా జాగ్రత్తగా నడుచుకొనవలెను? ఆ విధముగా ఉండుట అవసరమా? మీరేమనుకుంటున్నారు?**

విచారకరమైన విషయమేమిటంటే, కొన్ని సమయములలో క్రైస్తవులముగా మనలో క్రైస్తవ్యమును కలిగియుండలేకపోతున్నాము. ఇశ్రాయేలీయులు వారి యొక్క ప్రవర్తన ద్వారా ఇతర ప్రజలు దేవునిని అవహేళన చేసే విధముగా వారికి అవకాశమిచ్చారు. "వ్రాయబడిన ప్రకారము మిమ్మును బట్టియే గదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషింపబడుచున్నది" (రోమా 2:24) మన ప్రవర్తనకు చాలా విలువ ఉన్నది. అందుచేత చివరికి యేసును నమ్మని వారి యెడల కూడా దయ గలిగి మెలగాలి (తీతు 2:5; మరియు 2పేతురు 2:2) ఇతర ప్రజలు మనలో యేసును చూచుటకు క్రైస్తవ గృహము సహాయపడగలదు. ప్రజలు మనలను రెచ్చగొట్టి మనలో కోపమును పుట్టించినపుడు మనము సహనముతో వ్యవహరించాలి. దయ కలిగి ఉండాలి. అపుడు వారు మన విశ్వాసము నిజమైనదని తెలుసుకొందురు.

కొలొస్స 4:6లో మనము ఏవిధముగా మాట్లాడాలో పౌలు చూపిస్తున్నాడు. "ప్రతి మనుష్యునికి ఏలాగు ప్రత్యుత్తరమియ్యవలెనో అది మీరు తెలిసికొనుటకై మీ సంభాషణ

ఉప్పు వేసినట్లు ఎల్లప్పుడు రుచిగలదిగాను, కృపా సహితముగాను ఉండనియ్యుడి" (కొలొస్స 4:6) మన మాటలను గూర్చి ఈ వాక్యముద్వారా పౌలు మనకు ఇచ్చే సూచనలో మూడు భాగాలున్నవి. మొదటగా మన మాటలు ఎల్లపుడు దయకలిగినవిగా ఉండాలి. దేవుని ప్రేమతో నింపబడాలి. రెండవదిగా ఇతరులకు సహాయకరముగా ఉండునట్లు మాట్లాడాలి. మూడవదిగా మనము ఏమి మాట్లాడాలో ముందుగా తెలుసుకొని మాట్లాడునట్లు మనకు పరిశుద్ధాత్మ సహాయము సరియైన సమయములో అవసరమైయున్నది. అంతేగాక ఇతరులతో పంచుకొనే వర్తమానమును ప్రజల యొక్క మనస్సులను హృదయమును సిద్దము చేయుటకు పరిశుద్ధాత్మ వారికి కూడా సహాయముచేయును.

**మీ మాటలు మీ క్రియల గూర్చి ఆలోచించుడి. యేసునందు నీకున్న విశ్వాసమును గూర్చి వారు ఇతరులకు ఏ వర్తమానమును ఇవ్వగలరు**?

**శుక్రవారం** **మార్చి 20**

## అదనపు అధ్యయనం

ఒక కుటుంబము సంతోషముగా జీవించాలంటే ఆ కుటుంబములో ఉన్న సభ్యులందరూ వారి వారి బాధ్యతలను సక్రమముగా నిర్వహించాలని ముందుగా వారందరూ గ్రహించాలి. ప్రతి సభ్యుడు, కుటుంబములోని ఇతర సభ్యులను ప్రోత్సహించాలి. వారు ప్రేమ, సహనము మరియు దయ కలిగి మెలగవలెను. మృదువుగా మాట్లాడవలెను. కలవరము పెట్టే విధముగా ఏ ఒక్కరూ మాట్లాడకూడదు. కుటుంబ సభ్యులందరు గృహ యజమానురాలైన తల్లికి అన్ని విషయాలలో వారి సహకారమును అందించాలి.

"అందరూ కలిసి పనిచేయాలనే సూత్రమును గ్రహించి ఆ విధముగా కుటుంబములో ప్రవర్తించాలి. పిల్లలందరూ అనగా 6 సం॥లు పైబడిన పిల్లలందరు గృహములో ఉండే పనులలో వారి సహాయము అందిస్తూ ఉండులాగున పరిస్థితులను అర్ధము చేసుకొనవలెను" –ఎలెన్ జి వైట్ ఎడ్వంటిస్టు గృహము పుటలు 179,180.

మనము సంతోషముగా ఉండగోరిన యెడల మన హృదయములోనికి, మరియు గృహాలలోనికి యేసు ప్రవేశించునట్లు ఆయనను అనుమతించాలి. ప్రతి విషయములోను మన ఇండ్లు ఒక క్రైస్తవ గృహముగా ఉండునట్లు చూచుకొనాలి. గృహమనగా భూమిమీద చిన్న పరలోకమైయుండాలి. ప్రేమను గృహములో చూపించాలి. దానిని దాచి పెట్టి ఉంచకూడదు. మనము ఒకరియెడల ఒకరము చూపించుకొనే ప్రేమ మీద మన గృహములో సంతోషము ఆధారపడి యుంటుంది. మన ఒక్కరి ఆనందం కొరకు

ఆలోచించకూడదు. కుటుంబములోని ఇతర సభ్యులు మన కొరకు ఏమి చేయుచున్నారో దాని నిమిత్తమై వారికి మన ప్రేమను చూపించుటకు మనకు ఎదురయ్యే ప్రతి అవకాశమును వినియోగించుకొనవలెను. కుటుంబ సభ్యులను ఉల్లాసపరచి వారు చేసే పనిని సులభతరమయ్యేటట్టు వారికి సహకరించాలి. కుటుంబ సభ్యులెవరైనా విచారముగా ఉన్న యెడల వారిని మనము సంతోషపరచాలి. మనము వారిని ఎంతగా ప్రేమిస్తున్నామో తెలుసుకొనునట్లు చిన్న విషయాలను కూడా వారికి చేసి చూపించాలి. కుటుంబములో ఆరంభమైన ప్రేమ దినదినాభివృద్ధి చెందుతుంది. అట్టి ప్రేమను మన కుటుంబ సభ్యులు కాని ఇతరులకు కూడా చూపాలి. అటువంటి ప్రేమ ఇతరులను, మనలను కూడా సంతోషముతో నింపును. చిన్న చిన్న విషయాలను చేయకుండా, నిర్లక్ష్యముగా ప్రవర్తిస్తే ఇతరులను విచారముతో బాధపడునట్లు చేసిన వారమవుతాము."
–ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 3, పుట 539, 540.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మీరు వివాహము చేసుకున్నవారైతే, మీ వైవాహిక బాంధవ్యములో ఏ బైబిలు నియమాలు మీకు సహాయపడుచున్నవి? వివాహము కాని వారికి మీరిచ్చే సలహా ఏమిటి? వివాహము కొన్ని సమస్యలను ఎల్లప్పుడు కలుగచేస్తూనే ఉంటుంది. అట్టి పరిస్థితులకు వారిని ఏవిధంగా సిద్ధపరచగలరు?
2. నీ జీవితమును జాగ్రత్తగా జీవించవలసియున్నది అనే ఈ విషయమును గూర్చి, మరింత లోతుగా ఆలోచించు (కొలొస్స 4:5) ఒక సమయములో నీవు ఎంత జాగ్రత్తగ జీవించావో జ్ఞాపకమునకు తెచ్చుకొని ఆ సమయమును గూర్చి ఆ పరిస్థితులను గూర్చి మరొకసారి ఆలోచించు. ఆ సమయమును నీవు అజాగ్రత్తతో గడిపిన జీవితముతో పోల్చి చూడుము. ప్రతి అనుభవము నుండి నీవు నేర్చుకున్న పాఠములు ఏమిటి?

❋✶❋